# చవటల రాజ్యంలో

నందం రామారావు

ఆ రోజు ఆ పట్టణానికి మంత్రిగారొస్తున్నారు.

ఇంతకుముందు రాలేదా?

వచ్చారు. మరి,

అనేకమంది మంత్రులు అనేక రకాలుగా ఆ పట్టణానికి వచ్చారు!

బావుంది!

బావుండడమే కాదు.

బాగా వుండనిది కూడా వుంది!

ఏవిటది?

చిత్తగించండి!

* * *

ఆ పట్టణంలో మధ్య వున్న మెయిన్‌బజార్ స్థంభించిపోయి వుంది. అటూ, ఇటూ వాహనాలు కదలడంలేదు! వున్న పదిమంది పోలీసులూ, ఏ ఏ వాహనాన్ని ఎటు మళ్ళించాలో తెలియక తికమకపడుతున్నారు!

ఎండ చాలా తీవ్రంగా వుంది.

గాలి అందడమే లేదు.

చెమటవాసనతో కొందరు నడుస్తున్నారు.

కార్లలోతిరిగే బాబులు విదేశీ సెంట్లతో మత్తుగా జోగుతున్నారు.

ఆ ప్రాంతమంతా మహాపసందుగా లేదు!

ఎవరికివారు తొందరగా వెళ్ళిపోవాలని ఆరాటపడుతున్నారు. వారి ఆరాటాన్ని లాఠీతో అదరగొడుతున్నాడు కానిస్టేబుల్ గంగయ్య.

రోడ్డుకు ఆ ప్రక్కనుంచి ఈ ప్రక్కకు పెద్ద పెద్ద ఆర్చీలు అమర్చారు.

"సుస్వాగతం, మహానాయకుడికీ, పేదల పెన్నిధికీ మా స్వాగతం" అంటూ అందంగా బోర్డులు రాయించి పెట్టారు.

అరటాకులూ, మామిడిమండలూ వ్రేలాడదీశారు. ఇంకా ఆ ప్రాంతం కోలాహలంగానే వుంది. మనుషులూ, కార్లూ, బస్సులూ, రిక్షాలూ, బండ్లూ వాటిని అదుపులో పెట్టలేని పోలీసులూ!

ఈదారి గుండా మంత్రిగారొస్తానన్న సమయం- ఉదయం తొమ్మిది గంటలు.

ఇప్పుడు సమయం మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది.

ఆహ్వానితులూ, అధికారులూ, ప్రజలూ ఇంకా రాని మంత్రివర్యులను తమతమ భాషల్లో తిట్టుకుంటూ ఆ ఎండలో అలాగా నిలబడి వున్నారు!

* * *

"ఇదిగో ఎల్లమ్మా! మా అమ్మాయి నొప్పులు పడుతుంది. కాస్త సాయం సెయ్యవా?" నర్సమ్మ కంగారుగా అడిగింది.

"అయ్యో, అలాగా వొదినా! ఐతే, వుండు రిచ్చా పిలుత్తా. ఆసిపిటాలకి తీసుకుపోదాం" అంటూ ఎల్లమ్మ రిక్షా కోసం వెళ్ళి, రిక్షా తీసుకొచ్చింది.

నర్సమ్మ కూతుర్ని జాగ్రత్తగా రిక్షా ఎక్కించి, తాను ప్రక్కన కూర్చుని—

"నువ్వుకూడా రా వొదినా!" అంటూ ఎల్లమ్మనికూడా పిలిచింది.

ఎల్లమ్మ రిక్షాలో క్రింద కూర్చుంది.

"బేగిపోనీ నాయనా ఆసిపటాలకి, పిల్ల సూడు ఎట్టా కట్టపడుతోందో" అంది నర్సమ్మ రిక్షావాడితో.

రిక్షా హాస్పిటల్‌వేపు సాగింది.

నర్సమ్మ కూతురు మూలుగుతోంది.

ఆ పిల్ల తల్లి చేతుల్లో నిలవలేకపోతోంది.

బాధతో మెలికలు తిరిగిపోతూ, తల్లిని గట్టిగా పట్టుకుంటోంది.

గతుకుల రోడ్డులో రిక్షా సాఫీగా నడవక పోవడంవల్ల శరీరమంతా కదిలిపోతోంది.

నర్సమ్మ కూతుర్ని ఓదారుస్తూ గట్టిగా పొదివిపట్టుకుని, గుర్తుకొచ్చిన దేవుళ్ళందరికీ మ్రొక్కసాగింది. హాస్పిటల్ తొందరగా వస్తే బావుణ్ణు అనుకుంది.

పరిగెడుతున్న రిక్షా ఒక్కసారిగా ఆగిపోయింది

"వదినా! ఆసిపటాలు వొచ్చిందా?" అని నర్సమ్మ అడిగింది.

"లేదొదినా."

"మరేవిటి? ఇక్కడ ఇంతమంది వున్నారు?"

రిక్షావాడు క్రిందికి దిగాడు. తుండుగుడ్డతో ముఖం తుడుచుకున్నాడు. తుడుచుకుని అటుకేసి నడిచాడు.

పాపం! గంగయ్య చేత్తో లాఠీతో ఇంకా అవస్థపడుతూనే వున్నాడు. అతనిలో వున్న రక్తం అప్పటికే పూర్తిగాఆవిరైపోయింది!

ఒకే ఒక్క క్షణం కూర్చోవాలన్నా వీలుపడలేదు. కాళ్ళు పీకుతున్నాయి. నడుం నొప్పిగా వుంది. దాహంగా వుంది. వీటిలో ఏది తీర్చుకోవాలన్నా భయంగానే వుంది.

సరిగ్గా అదే సమయంలో మంత్రిగారు వస్తే—

"బాబూ! మంత్రిగారింకెంత సేపట్లో వస్తారు?" గంగయ్యను ఎవరో అడుగుతున్నారు.

"ఏమో ఎవడికి తెలుసు?"

"బాబూ! తొందరగా బస్సుకెళ్ళాలి. ఇటు పోనివ్వు."

"ఏయ్! వెళ్ళడానికి వీల్లేదు. మంత్రిగారొస్తున్నారు."

"ఇంకా రాలేదుగదండీ."

"ఇదిగో నీ వెధవ ప్రశ్నలకు సమాధానం చెప్పే ఓపికలేదుగానీ నోర్మూసుకుని అవతలకు వెళ్ళు."

ఆ ఆసామి ఏదో గొణుక్కుంటూ దూరంగా వెళ్ళిపోయాడు.

రిక్షావాడు అన్నీ తెలుసుకుని వచ్చి—

"మంత్రిగారొస్తారంట. అందుకేఇక్కడ ఆపేశారు. రిక్షా వెళ్ళడానికి వీల్లేదంట

చుట్టూ తిరిగి వెళ్ళాల్సిందే" అన్నాడు.

"నేనడిగొస్తా నుండు" అంటూ ఎల్లమ్మ రిక్షా దిగి గబగబా కానిస్టేబుల్ గంగయ్య దగ్గరకెళ్ళి-

"ఇదిగో పోలీసు బాబూ! అచెల్లాల" అన్నది.

"అచెల్లాలా? నా తల్లే. నువ్వేమన్నా మినిష్టర్‌గారి చెల్లెలివా?"




"బాబూ! పిల్ల కష్టపడుతోంది."

"ఏం చెయ్యను. కా ళ్ళు ప ట్ట నా?" అన్నాడు విసుగ్గా.

"అది కాదు బాబూ! ఆ ఎదురుగ్గావున్న ఆసిపిటాల్లో చేర్పించాలి."

"చేర్పించు."

"ఇటెల్లితే బేగెల్లిపోవచ్చు. ఆ అమ్మమెలి కలు తిరిగిపోతోంది."

"ప్రొద్దుట నుంచీ నేనూ మె లి క లు తిరిగిపోతున్నాను. అయినా ఇటెల్లడానికి వీల్లేదు. చుట్టూ తిరిగి పోవల్సిందే"

"పోలీసు బాబూ! సుట్టూ తిరిగితే ఆలిస మైపోద్ది. పిల్ల నొప్పులతో నిలవలేకుండా వుంది. పుట్టబోయే పిల్లోడికి నీ పే రె ట్టు కుంటాం. యిటూ పోనీ బాబూ" ఎల్లమ్మ ప్రాధేయపడింది.

"ఆదేం వీల్లేదు. నిన్ను పోనిస్తే నా వుద్యోగం వూడిపోతుంది." అం టూ గంగయ్య అక్కడనుంచి క దిలి వె ళ్ళి పోయాడు.

ఏం చెయ్యాలో తెలియక ఎల్లమ్మ గబ గబా రిక్షా దగ్గరకొచ్చి యెక్కింది.

రిక్షా వెనక్కి తిరిగింది!

* * *

రిక్షా హాస్పిటల్‌దగ్గర ఆగింది.

రోడ్డుదాటితే అయిదు నిముషాల్లో హాస్పి టల్‌కు చేరుకోవచ్చు. అటువంటిది చుట్టూ తిరిగి రావడంవల్ల అరగంట పట్టింది!

స్పృహలేకుండా తోటకూర కాడలా వ్రేలాడుతున్న ఆ పిల్లని నర్సమ్మా ఎల్లమ్మా చేతులమీద ఎత్తుకుని లోపలకు తీసుకెళ్ళారు.

డాక్టర్ పరీక్షచేసి పెదవి విరిచి—

"లాభంలేదు. పది నిముషాలు ముందుగా తీసుకొస్తే తల్లీ, బిడ్డా బ్రతికేవారు" అంది.

అంతే—

ఆ ఆడ వాళ్ళిద్దరూ ఘొల్లుమన్నారు ఆ శవం మీద పడి!

* * *

ఈ దేశంలో అతి సామాన్యులకు ఏం జరుగుతోందో అందరికీ తెలుసు!

తెలిసి చెయ్యగలిగిందేం లేదా?

ఎవరు విచారించినా, విచారించకపోయినా అప్పటికి సమయం మధ్యాహ్నం రెండు గంటలు దాటింది.

మంత్రిగారు ఇంకా రాలేదు!

అయ్యవారు వస్తారో, రారో తెలియదు. ఒక వేళ, వచ్చినా ఎన్ని గంటలకు వస్తారో తెలియదు. తెలియకపోయినా బందోబస్తు వుండవలసిందే!

పోలీసులకు చాలా చిరాగ్గా వుంది.

వస్తున్న కోపాన్ని అక్కడున్న జనంపై చూపుతున్నారు.

* * *

న ర్స మ్మా, ఎ ల్ల మ్మా ఆ శవాన్ని రిక్షాలో యెక్కించారు.

రిక్షా కదిలింది.

అప్పటికే రో డ్డు మీ ద వ్రేలాడగట్టిన తోరణాలూ, పాతిన అరటి మొక్కలూ ఎండిపోయాయి.

రిక్షా మళ్ళీ ఆ రోడ్డువైపే వ చ్చిం ది. ఇంకా, ఆ రోడ్డు పోలీసుల ఆధీనంలోనే వుంది

అంచేత—రిక్షా ముందుకు కదల్లేదు!

కదలదు కూడానూ!